



# పేరులోనే వుంది!

"కామం! కాఫీ రెడీయా?" సోఫాలో కూర్చొని ఆ రోజు వార్తాపత్రికలు తిరగేస్తూ అరిచాడు రామ్మూర్తి.

"అబ్బ! తెస్తున్నానుండండి" అని వంటగది లోంచి కాఫీ కప్పుతో వచ్చి అతని చేతికందించింది కామాక్షి. "అయినా అంతగా అరవడమెందుకూ? అలా పిలవడం మానమంటే యెలాగూ మానరు"

"నాకలా పిలవడమే యిష్టం అని ఎన్నిసార్లు చెప్పానోయ్!" కామాక్షి బుగ్గమీద చిన్నగా తట్టి అన్నాడు రామ్మూర్తి.

పెళ్ళయాక శోభనం రాత్రి భర్త తనను ప్రేమగా 'కామం' అని పిలిచినప్పుడు మొదట అదిరిపడింది కామాక్షి.

"అదేం పిలుపండీ" అంది సిగ్గుతో ముడుచుకుపోతూ.

"ఏం? అలా పిలవడం తప్పా?" ఏమీ ఎరగనట్టు ఆశ్చర్యంగా అడిగాడు రామ్మూర్తి.

"తప్పు అని కాదు. మరీ 'కామం' అని పిలిస్తే ఎవరైనా వింటే ఎబ్బెట్టుగా వుంటుంది" అంది కామాక్షి.

"దానిదేముంది! నా పేరు రామ్మూర్తి. నన్ను అందరూ 'రామం' అనేగా పిలుస్తారు. మీ అన్నయ్య శివానందాన్ని 'శివం' అని పిలవడం లేదూ ఇదీ అలాగే"

కామాక్షి తలపట్టుకొని కూర్చుంది.

"మీ యింట్లోవాళ్ళు, నీ స్నేహితురాండ్రూ ఎలా పిలుస్తారు నిన్ను?" అడిగాడు.

"మా యింట్లో పెద్దవాళ్ళందరూ 'కావుడూ' అంటారు"

"కావుడు, బ్రోవుడు అని దేవుళ్ళ విగ్రహాల ముందు ప్రార్థన చేసుకోవచ్చుగానీ అది పిలుపు కాదు" ఎగతాళిగా అన్నాడు రామ్మూర్తి.

"మిగిలినవాళ్ళు 'కామా' అంటారు. అదీ బాగోలేదా?" అంది కామాక్షి.

"బాగుందా, బాగోలేదా అని కాదు. ఆ పిలుపునకు అర్థం వుండాలి. 'రామ్మూర్తి' అనడానికి బదులు 'రామం' అనవచ్చు. రెండింటికీ అర్థం ఒక్కటే. కానీ 'కామాక్షి' అన్న పేరును 'కాము' అనీ, 'కామీ' అనీ అనకూడదు"

ఇదేం వాదమో అర్థం కాలేదు కామాక్షికి.

"పేరు పెట్టి పిలవడానికి కూడా అర్థం వుండాలేమిటండీ?"

"మరి? అర్థం పర్థం లేని పేరుతో పిలుస్తారా ఎవరైనా! నేను అలా పిలవను. నా స్నేహితుడొకడున్నాడు. వాడి పేరు కుక్కుటేశ్వరం..."

"కుక్కుటం అంటే కోడి అని అర్థం కాబట్టి 'కుక్కుటం' అని పిలుస్తారేమో?!" నవ్వింది కామాక్షి.

"అదేం కాదు 'కుక్కూ' అంటాను"

"అంటే వంటవాడిని పిలిచినట్టా" ఈసారి నవ్వాపుకొని అడిగింది.

సీరియస్‌గా చూశాడు రామ్మూర్తి. "వంటవాడిని 'కుక్కూ' అనరు. 'కుక్' అంటారు. 'కుక్కూ' అంటే కోయిల.."

"సరే..మీ చెల్లెలిని ఎలా పిలుస్తారు?" తెలిసీ అడిగింది కామాక్షి.

"ప్రేమలత అన్న పేరు గలవారిని యెవరైనా 'ప్రేమా' అనే పిలుస్తారు. లేదంటే 'లతా' అంటారు. ఇందులో సందేహం ఏముంది? నీ అభిప్రాయం నాకర్థమయిందిలే. నిన్ను అలా 'కామా' అని పిలవమనా? కామాలూ, ఫుల్‌స్టాప్‌లూ పేర్లు కావు"

"కామం మాత్రం పేరెలా అవుతుంది?" వారించబోయింది కామాక్షి.

"ఇలాంటి వాదాలతో కాలం వ్యర్థపరచడానికి వుద్దేశింపబడలేదు ఈ శోభనం రాత్రి" అని తెలివిగా కామాక్షి నోటికి తన పెదాలతో తాళం వేసేశాడు రామ్మూర్తి.

వాళ్ళ వివాహమైన రెండు నెలల తరువాత స్నేహితురాలు జనని వచ్చింది కామాక్షిని చూడటానికి. ఆమె పెండ్లికి రాలేకపోయింది దూరభారాన వుండబట్టి.

స్నేహితురాలిని చూసి చాలా సంతోషపడింది కామాక్షి.

ఇద్దరూ రెండు రోజులపాటు యెడతెగని కబుర్లలో మునిగిపోయారు. రామ్మూర్తి కూడా భోజనాల సమయం తప్పితే మిగిలినప్పుడు వాళ్ళను ఆటంకపరచకుండా వదిలేశాడు.

ఆ రోజు రాత్రి భోజనాలప్పుడు రామ్మూర్తి "అయినా మీ యిద్దరి పిలుపులూ గమ్మత్తుగా వున్నాయండీ! మీరేమో మా ఆవిడను 'కామూ' అని పిలుస్తారు. తనేమో మిమ్మల్ని 'జానూ' అంటుంది. ఇద్దరూ యిద్దరే! మీరైనా చెప్పకూడదూ అలా 'జాను, మూర' అని పిలువవద్దని" అన్నాడు నవ్వుతూనే లేచి వెళ్ళి చేతులు కడుక్కుంటూ.

"అదేమిటే మీ ఆయన అలా అంటాడు. పిలుపులో యేముంది?! అయినా ఆయన నిన్నెలా పిలుస్తాడేమిటీ?" ఆశ్చర్యంగా అడిగింది జనని.

"ఆ విషయం ఎందుకు చెబుతావులే" అని సిగ్గుపడింది కామాక్షి.

"తరువాత తీరిగ్గా సిగ్గుపడుదువుగానీ ఏమని పిలుస్తాడో చెప్పు"

"అలా పిలువవద్దని ఎన్నోసార్లు చెప్పానే. అయినా ఆయన 'కామం' అనే పిలుస్తున్నారు" అంది కామాక్షి మరింత సిగ్గుతో ముడుచుకుపోతూ.

అది విని పడీ పడీ నవ్వింది జనని.

"ఆ పిలుపు చాలా బాగుందనా ఆయన అభిప్రాయం?" అని అడిగింది నవ్వు ఆపి కాస్సేపటికి.

"ఆ..కామం అంటే అర్థం వుందట. కామూ, కావుడూ అనే పిలుపులకు అర్థం లేదట. అదీ ఆయన వాదం"

"పోనియ్. నువ్వంటే యిష్టమేనా? నీ యిష్టప్రకారం నడుచుకుంటాడా?"

"అబ్బో! దానికేమీ తక్కువ లేదు. నేనెంత చెబితే అంతే. గీచిన గీటు దాటరు. నేను నిప్పులో దూకమన్నా గుడ్డిగా దూకేస్తారు పాపం" అని చెబుతూంటే కామాక్షికి గర్వంగా అనిపించింది.

"ఓహో! కామాంధుడన్నమాట!" అని మళ్ళీ నవ్వింది జనని.

"ఛీ..పోవే" అని సిగ్గుబడబోయింది కామాక్షి.

"నీ సిగ్గు చితికినట్టే వుంది. నా దగ్గర అన్ని వంకరలు పోతావేమిటే! ఆయన నిన్ను 'కామం' అని పిలిచినప్పుడు సిగ్గుపడు కావాలంటే" అని పరిహాసం చేసింది జనని.

"జానూ! ప్లీజ్! నువ్వయినా ఆయనతో చెప్పవా అలా పిలవద్దని" ప్రాధేయపడింది కామాక్షి.

జనని బిత్తరపోయి చూసింది. "ఏమిటీ! నేను చెప్పాలా! ఆయన పెళ్ళాన్ని ఆయన ఎలా పిలవాలో నేనెలా చెప్పను. ఇది మరీ బాగుంది" అంది.

"మరి నాకు మాత్రం సిగ్గుండదేమిటీ!" కోపంగా



చూసింది కామాక్షి.

“ఏమో! నీ యిష్టం, ఆయన యిష్టం. నీకూ యిష్టమైతే అలాగే పిలిపించుకో. అయినా అస్తమానం అలా పిలవడు కదా! ఏదో కామం అవసరమైనప్పుడు...” జనని వాక్యం పూర్తి చేయకముందే ఆమె నోటిపై చిన్నగా కొట్టింది కామాక్షి చిరుకోపంతో.

“అదేనే 'కామం' అంటే నువ్వు అవసరపడినప్పుడు అని..” అని చెప్పి ఆమె మళ్ళీ కొట్టకుండా దూరంగా జరిగింది జనని పక పక నవ్వుతూ.

బయటకు ఎక్కడికో బయలుదేరుతున్న రామ్మూర్తి వాళ్ళ దగ్గరకు వచ్చి, “ఏమిటో స్నేహితురాళ్ళిద్దరూ తెగ నవ్వేసుకుంటున్నారు?” అన్నాడు.

“మరేం లేదండీ. మీకు తనంటే యిష్టమేనా అని అడుగుతున్నాను. మీ పెళ్ళయాక యిదే కదా నేను రావడం” అంది జనని సర్దుకొని.

“ఎందుకు యిష్టం వుండదు. భార్యను మనస్ఫూర్తిగా ప్రేమించనివాడు ఏం మనిషండీ! మా చెల్లెలు ప్రేమకన్నా తనంటేనే నాకిష్టం” అన్నాడు రామ్మూర్తి భార్యవైపు ప్రేమగా చూస్తూ.

“అంటే 'మీకు ప్రేమకన్నా కామమే యెక్కువన్న మాట!” అంది జనని పాయింటు దొరికిందని సంబరపడుతూ.

ఆ మాటతో అంత మగవాడూ ఆడపిల్లలా సిగ్గుపడిపోయాడు.

“మీ స్నేహితురాలు భలేగా మాట్లాడతారే!” అని కామాక్షితో చెప్పి హడావుడిగా చెప్పులు వేసుకొని బయటపడ్డాడు.

★ ★ ★

ఒకరోజు కామాక్షి అన్నయ్య శివానందం చెల్లెలిని చూడ్డానికి వచ్చి, రెండు, మూడు రోజులున్నాడు. అతను కూడా రామ్మూర్తి కామాక్షిని 'కామం' అని పిలవడం చూసి తెల్లబోయాడు.

రామ్మూర్తి లేని సమయంలో చెల్లెలితో “అదేమిటే, కావుడూ! నిన్ను బావ అలా పిలుస్తాడు! అసహ్యంగా లేదూ” అన్నాడు.

కామాక్షికి సిగ్గుతో చచ్చినంతపనయింది.

“ఏం చేయనన్నయ్యా? ఎంత చెప్పినా ఆయన వినిపించుకోనంటున్నారు” అంది.

“ఏకాంతంలో మాత్రం అలా పిలుస్తున్నాడా? లేక బయటకు వెళ్ళినప్పుడూ యితరుల ముందూ అలాగే పిలుస్తాడా?” చెల్లెలితో యిలా మాట్లాడవలసి వచ్చినందుకు యిబ్బందిపడుతూనే అడిగాడు శివానందం.

“ఆయనకు ఆ పిలుపులో తప్పేమీ కనిపించలేదట. ఆయన స్నేహితుల ముందు కూడా అలాగే పిలుస్తారు. వాళ్ళు అదోలా చూస్తూంటే నాకు సిగ్గుతో...” మాటలు రాక తడబడింది కామాక్షి.

“సరేలే నేను చెప్పిచూస్తాను. నువ్వేం దిగులుపడకు” అని ఓదార్చాడు శివానందం.

అతని అదృష్టమే అనుకోవాలి. ఆరోజే ఆ వీధిలోని ఆడవాళ్ళు నలుగురైదుగురు కామాక్షిని, రామ్మూర్తిని చూడ్డానికి వచ్చారు. ఆపై ఆదివారం నాడు అందరూ కలిసి ఎక్కడికో 'పిక్నిక్'లాంటిది ఏర్పాటు చేసుకున్నారట. వాళ్ళందరూ వారి వారి భర్తలతో సహా వస్తున్నారు కనుక కామాక్షిని కూడా పతీసమేతంగా రావాలని కోరారు.

కామాక్షికి తెలుసు రామ్మూర్తి ఒప్పుకోడని. వారానికి ఒక్కరోజు దొరికే సెలవు రోజున బయట ఎక్కడికీ వెళ్ళడం అతనికి యిష్టం వుండదు. ఇంటిపట్టునే వుండి కామాక్షికి అన్నిపనుల్లో సాయం చేయడం, హాయిగా తిని మధ్యాహ్నం పూర్తిగా విశ్రాంతి తీసుకోవడం, రాత్రి ఎనిమిది గంటలైనా దాటకుండా కామాక్షితోబాటు పడకగదిలో చేరి ఆనందంగా కాలం వెళ్ళబుచ్చడం - అదీ అతని దినచర్య ఆదివారంనాడు.

"మీరు ఆయన్నే అడగండి. ఆయన వస్తానంటే నాకేమీ అభ్యంతరం లేదు" అంది కామాక్షి ఆ వచ్చిన వాళ్ళతో.

"సార్! మీరూ, మీ శ్రీమతితో కలిసి రావాలి" అని అడిగారు వాళ్ళు రామ్మూర్తితో.

అతను ఏం చెప్పాలో తోచక దిక్కులు చూశాడు. తరువాత "లేదండీ! నాకు కుదరదు. ఏమీ అనుకోకండి. మరోసారి చూద్దాం" అన్నాడు. రామ్మూర్తి వాళ్ళు ఆ వీధిలోనికి వచ్చి కొద్దిరోజులే అయింది. వాళ్ళెవరితోనూ యింకా పరిచయం కూడా లేదు కాబట్టి నిర్మొహమాటంగా చెప్పాడు.

"అదేమిటిసార్! ఆదివారం పూర్తిగా సెలవే గదా! ఏం చేస్తారు యింట్లో కూర్చుని" అని అడిగింది ఒకావిడ.

"అదీ...నేను..." తడబడ్డాడు రామ్మూర్తి.


అదే అదనుగా శివానందం అందుకున్నాడు. "మేడమ్! మా బావ సిగ్గుపడుతున్నాడులాగుంది చెప్పడానికి. విషయమేమిటంటే మా బావకు స్నేహితులందరికంటే కూడా కామం ఎక్కువ..." ఆ వచ్చిన ఆడవాళ్ళు మొదట బిత్తరపోయారు. తరువాత సిగ్గుపడి, ఆ తరువాత అదోరకంగా చూశారు రామ్మూర్తి వైపు.

'ఛీ.ఛీ..' అని కూడా అనుకున్నారు ఒకరిద్దరు.

శివానందం అదేదీ పట్టించుకోకుండా కొనసాగించాడు.

"అందువలన ఆ రోజును మా బావ పూర్తిగా కామం కోసమే కేటాయించేస్తాడన్నమాట. ఆదివారం పూర్తిగా కామంతోటే గడుపుతాడు. అదీ సంగతి"

అతని మాటలు విన్న ఆ ఆడవాళ్ళందరూ కంగారుపడ్డారు. 'ఒకడేమో పరమ కాముకుడు. ఇంకొకడేమో ఆ కాముకుడిని గురించి వర్ణిస్తున్నాడు గొప్పగా.



నేరకపోయి వచ్చాము యిక్కడికి..' అనుకుని "మేము వస్తామండీ!" అని కామాక్షికి మాత్రం చెప్పి పరుగు పరుగున బయటపడ్డారు.ఇదంతా చూస్తున్న రామ్మూర్తి మాటలుడిగిపోయి శిలలా కూర్చుండిపోయాడు. భర్త మొహం చూసిన కామాక్షికి జాలివేసింది.

గడప దగ్గరకు పోయి వెళ్ళిపోతున్న వాళ్ళను "ఒక్క నిమిషం ఆగండి" అంది. వాళ్ళూ ఆగారు.

"మేము ఈ వీధిలోనికి వచ్చి యింకా ఎవరితోనూ పరిచయం చేసుకోలేదు కాబట్టి నా పేరు మీకు తెలియదు. నా పేరు కామాక్షి. మా వారు నన్ను 'కామం' అని పిలుస్తారు.." ఆమె పూర్తిగా చెప్పక మునుపే వాళ్లకు మొత్తం అర్థమయిపోయింది.

అందరూ ఒకసారి గట్టిగా నవ్వారు.

రామ్మూర్తి శివానందాన్ని కోపంగా చూసి గబగబా తన గదిలోనికి దూరాడు.

"మీరు భలేవారండీ! మమ్మల్ని కంగారుపెట్టేశారు మరీ!" అంది ఒకావిడ శివానందంతో.

శివానందం నవ్వాడు "ఏం చేయమంటారు చెప్పండి. అలా పిలువవద్దని మా బావకు చెబితే వినడని యిలా చేయవలసి వచ్చింది. మీరేమీ అనుకోరుగా!" అని చేతులెత్తి నమస్కారం చేశాడు.

"అయినా అంత అనురాగంతో చూసుకునే భర్త దొరకాలి కానీ, పేరులో ఏముందండీ! ఎలా పిలుస్తే ఏం?" అంది కామాక్షితో మరొకావిడ.

"అహహ! అలా అనకండి. పేరులోనే వుంది అంతా. ఆ పేరువలన వచ్చిన గొడవతోనే కదా మీరిందాకా కంగారుపడి పరుగెత్తింది. ఎలా పిలిచినా ఫరవాలేదుగానీ, అది భార్యాభర్తలకే పరిమితమైతే ఫరవాలేదు" అన్నాడు శివానందం.

వాళ్ళు సెలవు తీసుకుని వెళ్ళిపోయారు.

"కామాక్షీ కాఫీ" అన్నాడు రామ్మూర్తి గదిలోంచి నీరసంగా.

మొదటిసారిగా తన పేరును భర్త నోటినుండి విన్న కామాక్షి మొహం చేటంతయింది. శివానందం వైపు ఆనందంగా చూసింది.

"వెళ్ళు మరి!" అన్నాడు శివానందం చెల్లెలిని మురిపెంగా చూస్తూ.

○

## డేరింగ్ ప్రియాంక

ప్రియాంకా చోప్రా గ్లామరస్ స్టారే కాదు, ధైర్యసాహసాలున్న భామ కూడా. ఈమధ్య బాంకాక్‌లో 'ప్యార్ ఇంపాసిబుల్' షూటింగ్ జరుగుతున్నప్పుడు షూటింగ్‌లో భాగం కాకపోయినా కూడా 40 అడుగుల లోతున్న స్విమ్మింగ్ పూల్‌లోకి నాలుగంతస్తుల ఫ్లిప్ బోర్డు మీద నుంచి అమాంతం దూకేసిందిట ప్రియాంక. ఆమెకి ఏమీ కాకపోయేసరికి ఆ చిత్ర కథానాయకుడైన ఉదయ్ చోప్రా కూడా తను మాత్రం ఎందుకలా దూకకూడదనుకుని ట్రయ్ చేసాట్ట. ఇంకేముందీ? చేతికి బలమైన గాయమైందిట. ప్రియాంక మాత్రం ముసిముసిగా నవ్వుకుందిట. అంతే మరి!